
# గురు వైభవం



సద్గురు శ్రీ నాన్నగారు

# మనవి

గురువు యొక్క వైభవము గురించి ఇంతగా చెప్పకున్నా ఎంతగా చెప్పకున్నా అంతమేలేని వైభవమండి ఇది. సర్వ లక్షణ సంపన్నులైన సద్గురువు శ్రీ నాన్నగారి యొక్క ఋణము మనము ఎలా తీర్చుకుంటామండి. ఆయన చెప్పినది బాగా అర్థము చేసుకొని, ఆచరించి, అనుభవంలోనికి తెచ్చుకుంటే అప్పుడు గురువు ఋణం తీరుతుంది. ఇది సాధ్యము కావాలన్నా కూడా మన గురు దేవుల యొక్క పవిత్ర పాదాలకు ప్రణమిల్లి, ప్రణామములతో వేడుకొందాము. మనం అందరము తరించాలని, గురు ప్రేమను అందరూ ఆస్వాదించాలని కోరుకుంటూ...

# గురువైభవము

గురువు అంటే ఆత్మ, గురువు అంటే చైతన్యం దేవతలందరూ చేసేపని గురువే చేసేస్తాడు. బ్రహ్మ చేసేపని, విష్ణువు చేసేపని, శివుడు చేసే పని గురువే చేసేస్తాడు. ఒకవేళ భగవంతుడికి కోపం వస్తే మనకు అపాయం రాకుండా ఆకోపాన్ని గురువే మింగేస్తాడు. అంటే మనకు ప్రొటెక్షన్ యిస్తాడు. అనేక జన్మలనుండి నీవు భగవంతుడిని ఆరాధించగా ఆరాధించగా, ధ్యానించగా ధ్యానించగా మోక్షానుభవం పొందాలి అనే ధృడ సంకల్పముతో నీవు ప్రయత్నము చేస్తూ వుంటే భగవంతుడే ఒకే రూపం దాల్చి గురువుగా వచ్చి నిన్ను గైడ్ చేస్తాడు. గురువు మాట్లాడేటప్పుడు పని ఉండి మాట్లాడటంకాదు, కేవలం దయవలన మాట్లాడతాడు. గురువు నోటి నుండి వచ్చేమాటే దయ, ఆ మాటే జ్ఞానం ఆ మాటల్లో ప్రేమ వుంది అది గ్రహించిన వాడు ధన్యుడు.

అందరి హృదయాలలో అంతర్యామిగా ఉన్న ఈశ్వరుడే, ఆ చైతన్యమే భక్తుడిపట్ల జాలితో, భక్తుడిని పరిపక్వానికి తీసుకొని రావటము కోసం ఒక మానవ

రూపం ధరించి వస్తాడు వాడు గురువు. మనలో అంతర్యామిగా ఉన్న ఆత్మే, చైతన్యమే నిజమైన గురువు. బయటి గురువు మనకు బోధిస్తాడు. మనలను లోపలకు నెట్టటానికి ప్రయత్నం చేస్తాడు. లోపల గురువు మనలను లోపలకు గుంజుకుని జీవ లక్షణాలను తొలగించి మనలను శుభ్రం చేసి పక్వం చేసి తన స్వరూపాన్ని మనకు ఇస్తాడు. అదే ఆత్మ స్వరూపము, అదే జ్ఞాన స్వరూపము, ఆదే శాంతి స్వరూపము, అదే సుఖ స్వరూపము. ఆ సుఖం నీకు అనుభవములోకి వచ్చినపుడు దేవుడు వచ్చి ఎదురుగా నిలబడినా నీకు చూడాలని అనిపించదు, అది గౌరవము లేకపోవటము కాదు, ఆత్మానందములో జీవుడు ఊగిసలాడుతూ అంటాడు. వాడికి ఎటుచూసిన ఆనందమే, ఎటు చూసినా శాంతే, వాడికి శరీరముతో పనిలేదు.

గురువు నీతో సరదాగా మాట్లాడుతూ ఉంటాడు, ఏమిటి బాగున్నావా అంటాడు. పిల్లలు బాగున్నారా, వ్యాపారం బాగుందా అంటాడు. ఇవన్నీ కూడా నిన్ను లోపలకి తీసుకుని పోవటానికే చేస్తాడు. మధ్య మధ్యలో ఆత్మ గురించి బోధిస్తాడు, మీ యోగ క్షేమములు అడుగుతూ ఉంటాడు. అలా మీతో మాట్లాడుతూ

హృదయం యొక్క లోయలలోనికి నెట్టకొని పోతూ ఉంటాడు, మీకు ఏమీ ఇబ్బంది లేకుండా, పెద్ద బాధ లేకుండా ఆ సర్జరీ ప్రక్రియను పూర్తి చేసి మీకు మోక్షాన్ని ప్రసాదిస్తాడు వారు గురువు. నిన్ను హృదయంలోనికి నెట్టుతూ ఉన్నప్పుడు నీ బలహీనతలు, నీ అలవాట్లు అడ్డు వస్తూ వుంటాయి. జన్మాంతరము నుండి వచ్చే వాసనలనే బండరాళ్ళను నీవు గెంటలేవు. నీ చేత్తో ఏదో చిన్న ప్రయత్నం చేయించి ఆ రాళ్ళను ఆయనే గెంటేస్తాడు. సాధన చేసి వాటిని గెంటేసాను అని నీవు అనుకుంటావు కాని నీకు తెలియకుండా వాటిని ఆయనే గెంటేస్తాడు ఆ రాళ్ళను ఆయనే గెంటుతున్నప్పటికీ నువ్వే గెంటు తున్నట్లుగా నీకు అనిపింపజేసి, నిన్ను అనుగ్రహించి, నీకు ఆత్మజ్ఞానాన్ని ప్రసాదిస్తాడు, వారు గురువు.

నీ బుద్ధిలో వంకరలు ఉంటే ప్రకృతి మనుషులు ఏమి చేస్తారు అంటే నీ బుద్ధిలో వంకరలు ఉన్నాయని చెపుతారు కాని వాటిని తొలగించటానికి చూడరు. కాని గురువు అలాకాదు నీ బుద్ధిలో వంకరలు ఉన్నాయని నీకు చెప్పడు, వాటిని తొలగించటానికి చూస్తాడు. వారు గురువు.

గురువు అంటే ఆయన వరల్డ్లీమేన్ కాదు, ఆయన డివైన్‌మేన్. నీకు భయము వేస్తుంది అనుకో, ఆ భయాన్ని నెమ్మదిగా తొలగించి ఆత్మ విశ్వాసము కలుగచేస్తాడు. ప్రపంచము అంతా నీకు వ్యతిరేఖంగా ఉన్నప్పటికి నీవు ఒంటరిగా నీకాళ్ళమీద నీవు నిలబడేటట్లు చేస్తాడు. భయంలో నించి భయరహిత స్థితికి తీసుకొని పోయేటప్పుడు ఆ ప్రక్రియ నీకు తెలియనివ్వడు ఏమిటి ఇంత ధైర్యము వచ్చేసింది అనుకుంటావు. అంతకుముందు పిల్లిని చూసి భయపడేవాడు ఇప్పుడు పులితోకూడా పోరాటానికి సిద్ధమవుతాడు. గురువు యొక్క అనుగ్రహం అట్టిది. బాహ్యమైన చీకటిని సూర్యుడు ఎలాగ పోగొడుతున్నాడో అలాగ నీ లోపల వున్న చీకటిని గురువు పోగొడతాడు.

నీకు అమృతానుభవము కలిగే వరకు జన్మ జన్మలకు గురువు నిన్ను వెంటాడుతాడు. నీవు ఇంకొక జన్మలో మరొక శరీరం ధరించవచ్చు. కాని నీవు ఎక్కడ జన్మించావో గురువు చూసుకుంటూ ఉంటాడు. నీవు ఆయనను మరిచిపోయినా గురువు నిన్ను మర్చిపోడు. గురువు ఎక్కడ ఉన్నాడో నీకు తెలియదు. కాని నీవు ఎక్కడ వున్నావో గురువు చూసుకుంటాడు. గురువు రూప

రహితుడు. నామరహితుడు. గురువుకు దేహం ఉన్నా "దేహ రహితు"డు అందుచేత దేహము పోయినా గురువుతో సంబంధం తెగదు. నీకు ఏది మంచిదో నీచేత చేయిస్తాడు. నిన్ను డైరక్షన్ చూసుకో అని చెప్పడు. ఆయనే నీ చేయి పట్టుకొని హృదయ గుహలోనికి తీసుకుపోతాడు వాడు గురువు.

మనకు ఎవరైనా మంచి నీళ్ళు ఇచ్చినా, అన్నం పెట్టినా చిన్ని ఉద్యోగం ఇప్పించినా వారిపట్ల కృతజ్ఞత కలిగి ఉంటామే మరి మన హృదయంలో ప్రవేశించటానికి అడ్డుగా వున్న బండరాళ్ళని పెకిలించి బయటకు లాగి మన లోపల వున్న అంధకారాన్ని ఆయన దయతో బయటకు నెట్టి నిన్ను అజ్ఞానం నుండి బంధములోనుండి విడుదల చేసేవాడికి ఎంత కృతజ్ఞత చూపించాలి. నీవు వారిని పూజించకపోతే ఎవరిని పూజిస్తావు. నీవు వారిని ధ్యానించకపోతే ఎవరిని ధ్యానిస్తావు. మీరే చెప్పండి. గురువు మన వ్యాపకాలను పెంచడు, నీ వ్యాపకాలలో నుండి ఆందోళనలో నుండి నిన్ను విడుదల చేస్తాడు. మనం ఒకోసారి మాటలతో వర్ణించలేని మనస్సుతో ఊహించ లేని శాంతి సాగరంలో, ఆనంద సాగరంలో ఊగిస లాడుతూ ఉంటాము. ఇది మనం చేసే సాధనల

వలన వచ్చేసింది అని మనకు అన్పిస్తుంది. కానీ ఇది గురువు దయవలన వచ్చినది అని గ్రహించినవాడు ధన్యుడు.

శరీరానికి రెస్టుకావాలి, మనస్సుకు రెస్టు కావాలి. గురువు అంటే చైతన్యమే, చైతన్యానికి రెస్టు ఏమిటి? నీవు గురువు గురించి ఎలా అనుకున్నా ఆయన చేసే పని ఆయన చేసుకుంటూపోతాడు. మనం అజ్ఞానం అనే నిద్రలో ఉన్నాము. అందులోనుండి మనలను మేల్కొలప టానికి ఎక్కడ, ఎప్పుడు ఏమి చేయాలి అది ఎలా చేయాలి అని ఆయన చూసుకుంటూ ఉంటాడు వాడు గురువు.

ఎవరిని గురువుగా పెట్టుకోవాలి అంటే ఎవరి సమక్షంలో నీ ఇంద్రియాలు మనస్సు అణిగిపోతాయో, ఎవరి సన్నిధిలో నీవు శాంతి తరంగాలలో, కాంతి తరంగాలలో ఈదులాడుతూ ఉంటావో, ఎవరి ప్రెజెన్సులో నీకు తెలియకుండానే నీ మనస్సుకు లోచూపు కలుగుతుందో వాడే నీ గురువు.

నీలో ఎంతో కొంత భక్తి ఉంటే ఆ పిందని పండు చేయటానికి నీలో ఉన్న వ్యక్తి భావనను తగ్గించటానికి, అహంభావ రహితస్థితిని నీ చేత పొందింప చేయటానికి, ఈ కాలం ఆకాలం అనుకుండా గురువు ఎప్పుడూ నీకు

సహాయ సహకారములు అందిస్తాడు. నీకు అర్హత ఉంటే, యోగ్యత ఉంటే కేవలం నీ ఒక్కడికోసమైనా ఈశ్వరుడు గురువు రూపములో వస్తాడు.

స్మశానంతో దేహయాత్ర ముగుస్తుంది కాని జీవుడి యాత్ర ముగియదు. జీవుడియాత్ర ఎప్పుడు ముగుస్తుంది అంటే జ్ఞానోదయం అయిన తరువాత మాత్రమే. గురువు అనుగ్రహం లేకుండా జ్ఞానోదయం కలుగదు.

మనం అందరము ఏదో ఖర్మ అనుభవించటానికే వస్తాము. కాని గురువు యొక్క శరీరము ఖర్మ అనుభవించటానికి రాలేదు. ఆనందంలో నాని నాని ఉబికి ఉబికి ఒక రూపంగా శిష్యులిని ఉద్ధరించటానికి ఆనంద తాండవములో శరీరం ధరించాడు కాబట్టి వారి శరీరము కూడా ఆనందమే. అందుచేత ఆయనను చూసేటప్పటికి మనకు కూడా ఆనందం కలుగుతుంది. నా మాటలు నమ్మకపోతే " ఆయనవైపు చూడండి, మీకే తెలుస్తుంది" గురువు యొక్క శరీరము ఆనందంలో వచ్చింది. మరల ఆనందంలోనే ఆ శరీరం అదృశ్య మవుతుంది. మనకు దుఃఖం పంచిపెట్టటానికి గురువు రాలేదు. ఆనందం పంచిపెట్టటానికి వచ్చాడు. ఆనందాన్ని, శాంతిని, జ్ఞానాన్ని మనతో షేర్ చేసుకోవటానికి గురువు

వచ్చాడు. అందుచేత ఆయన శరీరం కూడా ఆనందమే, ఆయన శరీరం కూడా శాంతే. ఆయన శరీరం కూడా చైతన్యమే.

గురువు ఎలా ఉంటాడు అని అడుగుతున్నావు. గురువు ఓర్పుగా ఉంటాడు, శాంతిగా ఉంటాడు. గురువు యొక్క ఓర్పుకు హద్దులు ఉండవు. సూదంటురాయి ఇనుమును ఆకర్షించినట్లు తన మాటలతో, తన చూపులతో భక్తుడిని ఆకర్షించు కొంటాడు. ఆకర్షించు కోవటమేకాదు తన స్వరూపాన్ని ఇస్తాడు. గురువు ఎంతటివాడో ఇప్పుడు నీకు తెలియదు నువ్వు ఎవడో నీకు తెలిసాక, నీ స్వరూపం నీకు తెలిసాక గురువు యొక్క వైభవం గురించి, గురువు యొక్క విశిష్టత గురించి నీకు తెలుస్తుంది. అప్పటివరకు గురువు అంతటివాడు, గరువు ఇంతటివాడు అని నోటితో చెప్పినా, నీ మనస్సుతో ఊహించినా, గురువు యొక్క ఔన్నత్యాన్ని నీవు గుర్తించలేవు. నీ స్వరూపం నీకు తెలిసాక గురువు యొక్క ఔన్నత్యం నీకు తెలుస్తుంది. అంతవరకు ఏదో తెలిసినట్లుగా అనిపించినా నీకు తెలియదు. అన్ని జీవరాశులలో నీ గురువునే చూడటం నేర్చుకొనే పరిస్థితిని కల్పిస్తాడు. అప్పుడు నీకు ఎటుచూసినా గురువే

కనిపిస్తాడు. అలా నిన్ను అనుగ్రహిస్తాడు.

నీవు ద్వైత బుద్ధి పెట్టుకోవద్దు. ద్వైత బుద్ధి వున్నంతకాలం పునర్జన్మ వస్తుంది. మొదటలో గురువు వేరు, నేను వేరు అని నీవు అనుకోవచ్చు. నీవు ఎలా అనుకుంటున్నావో గురువు చూస్తూ అంటాడు. ఆ భేద బుద్ధిలోనుండి నిన్ను విడుదల చేసి అభయస్థితిని కలుగజేసి నిన్ను అనుగ్రహించి నీకు మోక్షాన్ని యిస్తాడు. వాడు గురువు.

గురువు దయ నా మీద ఉంటుందా అని అడిగితే దయ ఎప్పుడూ ఉంటుంది. దయ నువ్వు అడిగినా ఉంటుంది. అడగకపోయినా ఉంటుంది. నీకు అర్హత వస్తూ వుంటే దయ యొక్క స్వరూపము నీకు తెలుస్తూ ఉంటుంది. అగ్ని వేడి లేకుండా ఉండదు అలాగే గురువు దయ లేకుండా ఉండదు. గురువు దయ నాకు ఎలా తెలుస్తుంది అంటే గురువు మీద భక్తివలన, విశ్వాసం వలన అది నీకు తెలుస్తుంది. గురువుకు శరణాగతి చెందు అప్పుడు ఆయన దయ నీకు తెలుస్తుంది. నీకు బ్రహ్మానుభవం కలిగేవరకు గురువు నిన్ను వెంటాడుతూ ఉంటాడు. గురువును ఆశ్రయించు గురువును విడవకుండా పట్టుకో, ఆయన చెప్పినది శ్రవణం చేయి వారికి సేవ చేయి

గురువుకు సేవ చేసే కొలది, ఆయన మాటలు శ్రవణం చేసేకొలది నీకేమి తెలుస్తుంది అంటే ఏ కారణం వలన ఈ జన్మలోనికి వచ్చాము. ఏ కారణము వలన మనకు ఈ దు:ఖము కలుగుతుంది ఆ కారణాలు తెలుస్తాయి. ఆ కారణాలు నీకు తెలిసాక వాటిని ఆయనే కత్తిరించి తొలగిస్తారు. అప్పుడు నీకు దుఃఖంతోటి జన్మతోటి ఉన్న సంబంధము ఊడిపోతుంది అలా అనుగ్రహించే వారు గురువు ఒక్కడే. భక్తి భావన ఇచ్చేవాడు గురువే అజ్ఞానాన్ని తొలగించుకోవాలని బుద్ధి ఇచ్చేవాడు గురువే. అజ్ఞానంలో నుండి విడుదల చేసేవాడు గురువే. నీకు బ్రహ్మ నిష్ట కలుగచేసేవాడు గురువే. అన్నీ గురువే.

గురువు దేహంలో ఉండవచ్చు, ఉండకపోవచ్చు. దేహములో ఉన్నా దేహంలో లేకపోయినా గురువుతో మానసిక అనుబంధం ముఖ్యం గురువు దేహంలో లేనంత మాత్రాన అక్కడ పని జరగదు అని అనుకోవద్దు. అక్కడ పనిచేసేది దేహము కాదు పని చేసేది ఆత్మ, చైతన్యమే. మీకు గురువుతో మానసిక అనుబంధము లేకపోతే ఆత్మ సాక్షాత్కారమును పొందలేరు.

గురువు యొక్క సన్నిధిలో ఉంటే దేహంలో ఉండి దేహంలేని స్థితిని, లోకంలో ఉండి లోకం లేని స్థితిని

పొందుతావు. గురువుకు ప్రాక్టికాలిటీ ఎక్కువ ఉంటుంది. వారు ఏదిగా ఉన్నారో అది మీచేత పొందింపచేయడానికి చూస్తాడు. ఉన్నదంతా నీలోపలే ఉంది, బయటేమీలేదు. కొన్ని కొన్ని బలహీనతలు చాలా లోతుగా ఉంటాయి. టీచింగ్ వలన పోవు అప్పుడు ఒకో సంఘటనను క్రియేట్ చేసి మిమ్ముల్ని తలుపు సందున పెట్టి నొక్కినట్లుగా నొక్కుతాడు అప్పుడు కాని మీలో ఉన్న పసరు అంతా బయటకు రాదు. అలా మీలో ఉన్న బలహీనతలను బయటకు కక్కించి, మిమ్మల్ని పరిశుద్ధంగా చేస్తాడు.

గురువు అంటే వారు మనలాగే ఉన్నాడు. మనతోటి తిరుగుతున్నాడు అని అనుకోవద్దు. గురువు అంటే మహాసాగరము. ఆకాశం ఎంత విశాలముగా ఉందో, సముద్రం ఎంత లోతుగా ఉందో గురువు కూడా అలాగ ఉంటాడు. ఆయనకు హద్దులు ఏమీ లేవు. ఆయన మనతో ఇష్టంగా మాట్లాడటం ఎందుకు అంటే మనలను ఆ మహాసాగరంలోనికి లాగేయటానికి అక్కడకు వెళ్ళామా మన రూపం, నామం పోతాయి. గురువు అనుగ్రహం అంత వేగముగా ఉంటుంది.


గురువు అనుగ్రహానికి అసాధ్యం అంటూ

ఏమీలేదు. మీరు కూర్చున్నవారు లేవకుండా మీకు ఆత్మజ్ఞానం ఇవ్వగలడు. వారు గురువు. మీలోని బలహీనతలను, స్వార్థాన్ని మీదేహగతమైన నేనును అన్నింటిని బయటకు లాగి కాల్చి బూడిదచేసి మీకు ఆత్మజ్ఞానాన్ని ఇస్తారు వారు గురువు. గురువును ఉపాసించటము వలన గురువు యొక్క దయ మనకు కలుగుతుంది. గురువు యొక్క రూపాన్ని ధ్యానించాలి, గురువుని స్మరించాలి ఆయనలోని గుణాలను ఆస్వాదించాలి. గురువు యొక్క అనుగ్రహము ఎలాంటిది అంటే పులినోట్లో పడిన మాంసము ముక్కలాంటిది. దాన్ని పులి మింగకుండా ఆపలేము. అలాగే గురువు యొక్క అనుగ్రహములో పడినవాడు తరించే తీరుతాడు. ఇందులో ఏమాత్రము సందేహము లేదు.

మీరు ఎన్ని తీర్థయాత్రలు చేసినా, గుడులు చుట్టూ తిరిగినా ఇవి అన్నీ కూడా జ్ఞాని యొక్క ఒక్క చూపుతోటి సరిపోవు. జ్ఞాని యొక్క మాట శక్తివంతంగా వుంటుంది. అది కొండలను దాటుతుంది. సముద్రాలను దాటుతుంది. ఈ ప్రపంచము అంతా వ్యాపిస్తుంది. ఎందుచేతనంటే జ్ఞాని యొక్క నాలుక హృదయంలో ఉంటుంది. జ్ఞాని యొక్క ప్రభావం భక్తులమీద ఉంటుంది. జ్ఞాని అన్నా,

మహాత్ముడు అన్నా, గురువు అన్నా ఇవి అన్నీ పర్యాయపదాలు మనం గురువును పట్టుకుంటే మనం వదిలేస్తే వదిలి వేయవచ్చు, అలాకాకుండా గురువు మనలను పట్టుకుంటే వదలటం అనేది ఉండదు. జ్ఞాని సత్యసంకల్పుడు నువ్వు బాగుపడాలి అనే సంకల్పం ఆయనకు వస్తే అది నీ మీద పని చేస్తుంది. గురువు అనుగ్రహములో పడినవాడు బయటకు వచ్చే అవకాశం లేదు. వాడిని రక్షించి తీరుతాడు. గురువు చేసే సహాయం మన కళ్ళకు కనబడదు, చెవులకు వినపడదు. మన మనస్సు మేటర్ లేకుండా ఉండలేదు. మనం నో మైండ్ స్టేట్‌కి రావాలి అంటే గురువు సహాయం లేకుండా అది జరగదు. మనకు గురువే బిగ్గెస్ట్ రిలేటివ్ గురువుని మించిన పెద్ద బంధువు మనకు ఎవరూ లేరు. గురువు కంటే మన క్షేమం కోరేవాడు ఎవరూ లేరు. గురువు యొక్క ప్రేమ అన్ వరల్డీ లవ్ అది భౌతికానికి సంబంధించినది కాదు. గురువు ఏ స్థితిలో ఉన్నారో ఆ స్థితిలోకి మనని తీసుకొని పోయేవరకు ఆయన మనలను విడిచిపెట్టడు. గురువు యొక్క అనుగ్రహానికి అసాధ్యము అంటూ ఏమీ లేదు. మిమ్మల్ని దుఃఖలేని స్థితికి తీసుకొని పోవటము గురువుకే సాధ్యం. గురువు మౌనంగానే పనిచేస్తాడు.

# భగవాన్
# శ్రీ రమణ మహర్షి



## శ్రీ రమణ ప్రింటర్స్

డోర్‌నెం. 26-20-19, స్వామివీధి, గాంధినగర్, విజయవాడ-3.

99850 68630, 95810 24318